క్లుప్తంగా

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: 67వ ఎస్‌జీఎఫ్ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్–14 బాలికల కబడ్డీ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు భూక్య నీలవేణి ఎంపికైనట్లు జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సమ్మెట వెంకటేశ్వర్లు, పీఈటీ చాంప్ల నాయక్ తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈనెల 28న ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో జరగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో నీలవేణి పాల్గొంటుందన్నారు. మరో విద్యార్థి లావుడ్య సందీప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ భూక్య వెంకట్రాములు పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, రూ.18వేల విలువైన పుస్తకాలను శనివారం అందజేశాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, సోహెన్, శ్రీనివాసరావు, తిరుపతి, షిబారాణి, అల్లి సతీష్, శ్రీనివాస్, సోమేశ్వర్, ఝాన్సీ, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీధర్, కవిత, జ్యోతి, విద్యా కమిటీ చైర్మన్ చిరంజీవి పాల్గొన్నారు.

జీవితకాల వితరణకు ప్రమాణపత్రం అందజేత



కురవి: మండలంలోని సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, కురవి ఆలయ మాజీ ధర్మకర్త మండలి సభ్యుడు కన్నెగంటి వెంకటరమణ–పద్మావతి దంపతులు దివంగత కన్నెగంటి వీరభద్రయ్య–సౌభాగ్యమ్మ, సమరయోధుడు కన్నెగంటి బద్రినారాయణ జ్ఞాపకార్థం ప్రతీ ఏటా జీవిత కాలంపాటు రూ.3,601 వితరణ చేసేందుకు ప్రమాణపత్రాన్ని శనివారం హెచ్‌ఎం ధరావత్ వెంకన్నకు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్‌కుమార్, విజయ్, అంజద్‌పాషా, సంధ్యారాణి, సురేష్ పాల్గొన్నారు.

కలశాలతో జైనుల ర్యాలీ



డోర్నకల్: డోర్నకల్‌లో శనివారం జైనులు 108 కలశాలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డులో నూతనంగా నిర్మించిన పాలరాతి జైన మందిర ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా జైన మతానికి చెందిన స్త్రీ, పురుషులు ఊరేగింపు నిర్వహించారు.

చెక్కు అందజేత



మహబూబాబాద్ రూరల్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వీఎస్‌కేపీ పథకం చెక్కును శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో క్లబ్ డిస్ట్రిక్ట్ వీ101ఏ వైస్ గవర్నర్ వేమిశెట్టి కిశోర్ కుమార్ శనివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.1.50లక్షల చెక్కును అందజేశాడు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సోమ రజిని కుమార్, ప్రధాన కార్యదర్శి సోమ రాధాకృష్ణ, కోశాధికారి పుల్లఖండం ప్రభాకర్, మోహన్ రావు, సోమ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



కేసముద్రం: సమీకృత వ్యవసాయ రంగంలో రాణిస్తున్న మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన బొబ్బాల యాకుబ్‌రెడ్డి హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో ఏరువాక రైతు ఎక్సలెన్స్ 2023 అవార్డు శనివారం అందుకున్నాడు.

రోడ్డు నాణ్యత పరిశీలన

డోర్నకల్: ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు నుంచి ముల్కలపల్లి వరకు నిర్మించిన సుమారు 13 కిలోమీటర్ల బీటీ రోడ్డు నాణ్యతను శనివారం నేషనల్ క్వాలిటీ మానిటర్ లొహారే పరిశీలించాడు. కార్యక్రమంలో పీఆర్ డీఈ జుంకీలాల్, కురవి ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామర్థ్యాలను పరీక్షించుకోవాలి

- విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్ట్

మహబూబాబాద్ అర్బన్: పోటీ పరీక్షల్లో విద్యార్థులు తమ సామర్థ్యాలకు అవకాశం వచ్చినప్పుడు పరీక్షించుకోవాలని తెలంగాణ గణిత శాస్త్ర ఫోరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రవి, శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు మండల స్థాయి గణిత ఫోరం పోటీ పరీక్షలు నిర్వహించారు. జిల్లాస్థాయి గణిత శాస్త్ర ఫోరానికి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు కాసం శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం కోట్యా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం తెలంగాణ గణితఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.మాధవాచారి అధ్యక్షతన మండలస్థాయి గణిత ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియంలో కురవి హైస్కూల్ విద్యార్థి వి.శ్రీరామ్ ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో జెడ్పీ హైస్కూల్ మోద్గులగూడెం విద్యార్థి నితిన్, తృతీయ స్థానంలో కురవి హైస్కూల్ నుంచి జి.ప్రేమ్‌కుమార్, తెలుగు మీడియంలో జెడ్పీ హైస్కూల్ గుండ్రాతిమడుగు నుంచి ప్రథమ నుంచి తృతీయ స్థానాల్లో నవ్య, వర్షిత, ఎల్.శేఖర్‌లు నిలిచారు. కార్యక్రమంలో మండల గణితఫోరం అధ్యక్షుడు సీతారాములు, ప్రధాన కార్యదర్శి నర్సింహాచారి, సమన్వయకర్త మల్లికార్జున్, గణిత ఉపాధ్యాయులు శంకర్, ఇందిర, కురవి హైస్కూల్ హెచ్‌ఎం వాహిద్, ఉపాధ్యాయులు శ్రీధర్, వెంకన్న, విజయలక్ష్మీ, విజయ్‌రాజ్, కుమారస్వామి, కళావతి పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: అందజేసిన బహుమతులతో విద్యార్థులు

గార్ల: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో గార్ల బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన గణితం టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విజేతలకు ఎస్సై జీనత్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తెలుగు మీడియంలో పుల్లూరు హైస్కూల్‌కు చెందిన బి.సాధన ప్రథమ బహుమతి, మద్దివంచ హైస్కూల్‌కు చెందిన బి.శ్రావణి ద్వితీయ, గోపాలపురం హైస్కూల్ కు చెందిన టి.రాజేశ్వరిబాయి తృతీయ బహుమతి సాధించారు. ఇంగ్లిష్ మీడియంలో స్రవంతి, లహరి, సాధన సాధించారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర బస్సీలాల్, గణిత ఫోరం మండల అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఎంఎన్‌ఓ వీరభద్రం, శివ, బాలాజీనాయక్, సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

పోటీలతో ఆలోచనలు పెంపు

పెద్దవంగర: పోటీల్లో పాల్గొనే విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందుతాయని నోడల్ హెచ్‌ఎం బుధారపు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం తెలంగాణ గణిత ఫోరం మండల అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. పెద్దవంగర జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి శామిని, రంజిత్, సింధూ ప్రియ, నాని, చిట్యాల నుంచి లుకేష్ అవుతాపురం నుంచి నాని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపాడు.



కురవి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



గూడూరులో..

కేసముద్రం: కేసముద్రం మండలం కల్వల, ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో శనివారం మండలస్థాయి గణిత టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈమేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈనెల 22న జిల్లాస్థాయిలో వారు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రూపారాణి, బండారు నరేందర్, తెలంగాణ గణిత ఫోరం మండల అధ్యక్షుడు తండ సదానందం, తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: కల్వల జెడ్పీ హైస్కూల్‌లో ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు



గార్ల: గెలుపొందిన విద్యార్థినులు

గూడూరు: మండల స్థాయి గణిత పోటీల్లో ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఎంఎన్‌ఓ చీర భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో శనివారం మండల స్థాయి గణిత పోటీలు నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియంలో గడీల రేవం, రాకేష్, ముదునూరి ప్రశాంత్ ఎంపికయ్యారు. తెలుగు మీడియంలో బానోతు మహేష్, రాజ్‌కుమార్, జాటోతు మహేష్ ఎంపికైనట్లు తెలిపారు.

22న సెలవు ప్రకటించాలి



మహబూబాబాద్: ఈనెల 22న అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా విద్యాసంస్థలకు సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నాగరాజు, గోపికృష్ణ శనివారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతి పత్రం అందజేశారు.

లే అవుట్ చేస్తే చర్యలు

నెల్లికుదురు: మండల పరిధిలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎక్కడైన ప్లాట్లు లేఅవుట్ చేసి విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీఓ పార్థసారధి అన్నారు. మండలంలోని వావిలాల గ్రామ పరిధిలో ప్రభుత్వ అనుమతి లేకుండా మహర్షి కంపెనీ పేరుతో ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో శనివారం పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో కలిసి లే అవుట్లను తొలగించినట్లు తెలిపాడు.

స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్



గూడూరు: మహబూబాబాద్ జిల్లా స్వేరోస్ నెట్‌వర్క్ అధ్యక్షుడిగా గూడూరు మండల కేంద్రానికి చెందిన కామగాని యాదగిరిగౌడ్‌ను శనివారం ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నెమ్మతి రమేష్, కోశాధికారి మద్దపల్లి సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా మహంకాళి గౌతమ్, సహాయ కార్యదర్శిగా అలువాలా మధు ఎన్నికయ్యారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

తొర్రూరు: ఉపాధ్యాయుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పీఆర్‌టీయూ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జినుగ విప్లవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముత్తిలింగంలతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, చీకటి వెంకన్న, దుబ్బాక శ్రీధర్‌రెడ్డి, భూసాని సోమన్న, కొల్లూరు అశోక్, రమేష్, రేణుకాదేవి, వసుంధర, శ్రీనివాసాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు: డైరీలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

గార్ల: పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను శనివారం గార్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎస్సై జీనత్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతనిప్పు రమేష్, సర్పంచ్ అజ్మీర బస్సీలాల్, ఎంఎన్‌ఓ వీరభద్రం, హెచ్‌ఎం పోట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చెరువులో అక్రమంగా బావులు తవ్వితే చర్యలు

గూడూరు: గూడూరు శివారు చంద్రుని చెరువులో అక్రమంగా తవ్విన బావిని శనివారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో పూడ్చారు. చంద్రునిచెరువు ఆయకట్టు కాని ఓ రైతు తన పంట పొలం కోసం అక్రమంగా రాత్రి చెరువు శిఖంలో ఓ పెద్ద బావిని తవ్వించాడు. ఇది గుర్తించిన చెరువు ఆయకట్టు రైతులు మండల రెవెన్యూ, నీటిపారుదల అధికారులకు ఫిర్యాదు చేశారు. బావిని పరిశీలించిన అధికారులు జేసీబీతో పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారి అలీ, తహసీల్దార్ అశోక్‌కుమార్ చెరువు శిఖం భూములు ఆక్రమించినా, అక్రమంగా బావులు తవ్విన చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

‘సోషల్ మీడియా ప్రచారాలు అవాస్తవం’

మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యేపై కన్నెర్ర, దొరగడికి తాళం వేసిన కాంగ్రెస్ కార్యకర్తలు అని సోషల్ మీడియా వేదికగా బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న ప్రచారాలు అవాస్తవమని ఉమ్మడి మల్యాల కాంగ్రెస్ బాధ్యుడు లాలావత్ రమేష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్‌పై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కన్నెర్ర చేశారని, గడికి తాళం వేశారని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ నాయక్ కూడా అకారణంగా ఆరోపణలు చేస్తున్నారని, మానుకోవాలని పేర్కొన్నాడు. ఈ సమావేశంలో మల్యాల మాజీ ఎంపీటీసీ బానోత్ చిమ్నానాయక్, భూక్య సుందర్, పాపిరెడ్డి, బానోత్ వాళు, వెంకన్న, గుగులోత్ మురళీ, బానోత్ సాయి, బోడ హరిలాల్, తేజావత్ శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లాలావత్ రమేష్

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అరుణ

నెల్లికుదురు: బాలికలు తమ హక్కులను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు మంచి పోషకాహారం తీసుకుని భవిష్యత్‌లో గొప్పగా ఎదగాలని సూచించారు. అనంతరం తహసీల్, ఎంపీడీఓ, మండల మయూరి సమాఖ్య కార్యాలయాల ముందు బేటీ బచావో బేటీ పడావో అనే వాల్‌పోస్టర్లను అతికించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం

పెద్దవంగర: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని నోడల్ హెచ్‌ఎం బుధారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నోడల్ హెచ్‌ఎం మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ ఎస్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిందని నేటి నుంచి 29 తారీకు వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 1 నుంచి 8వ తరగతులకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రకటిస్తామని, 22 జాబితాల అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 24న పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల తుది జాబితాను విడుదల చేసి 29 ఎన్నికలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

డ్రోన్ స్ప్రేయర్‌పై రైతులకు అవగాహన



డ్రోన్ స్ప్రేయర్‌పై అవగాహన కల్పిస్తున్న సందీప్

దంతాలపల్లి: ఆధునిక పద్ధతిలో మందులు పిచికారీ చేసినప్పుడే రైతుకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి గాడిపల్లి సందీప్ అన్నారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో రైతుల పంటపొలాల వద్ద క్షేత్రస్థాయిలో రైతులకు డ్రోన్ స్ప్రేయర్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పద్ధతులతో రైతులకు సమయం, ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. డ్రోన్ సహాయంతో మందులు పిచికారి చేస్తే ఎకరాకు కేవలం 550 మాత్రమే ఖర్చు అవుతుందని, మొక్కలకు ఎరువులు, క్రిమిసంహారక మందులు సమర్థవంతంగా అందుతాయన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

తొర్రూరు రూరల్: మండలంలోని కంఠాయపాలెం, చింతలపెల్లి గ్రామాలతోపాటు పట్టణంలో వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటానాని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలతోపాటు గుండెపోటుతో మృతి చెందిన స్వతంత్ర టీవీ రిపోర్టర్ బోగోజు సురేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, మున్సిపాలిటీ చైర్మన్ మంగళపెల్లి రామచంద్రయ్య, జినుగ వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దయాకర్‌రావు

సంక్షిప్త సమాచారం

పార్లమెంట్‌లో బిల్లుపెట్టాలి

నెహ్రూసెంటర్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకు పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని ఎంఆర్‌పీఎస్ దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి కోండ్ర ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మట్లాడారు. సమావేశంలో బాలకృష్ణ, రాధా, సందీప్, సురేష్, సుధారాణి, మల్లయ్య, స్వామి పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

కురవి: మండలంలోని నేరడ శివారు భంగ్యా తండాలో ఎంపీపీ నిధులు రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య మంగీలాల్, మాజీ సర్పంచ్ భూక్య హచ్యా నాయక్, తండా పెద్దలు పాల్గొన్నారు.

నోటిఫికేషన్లు ఇవ్వాలి

బయ్యారం: ఉపాధి అవకాశాలు లేకుండా ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులకు కొత్త ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించి వారి జీవితాల్లో మార్పులు తేవాలని పీవైఎల్ రాష్ట్ర నాయకులు తుడుం వీరభద్రం డిమాండ్ చేశారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్, మురళి, రవి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

మరిపెడ రూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ మండల కోర్డినేటర్ నిరుడు శిరీష అన్నారు. శనివారం మండలంలోని అబ్బాయిపాలెంలో మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలపై అవగాహన సదస్సు ఝాన్సీ లక్ష్మీబాయి గ్రామైక్య సంఘం సీఏ తీగల లలిత అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య, వార్డు సభ్యురాలు చాందిని, మహిళా సంఘం సభ్యులు నాగమణి, ఏకమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ చీర భిక్షపతి తెలిపారు. ఈ పరీక్షా కేంద్రానికి గూడూరు, కొత్తగూడ, గంగారం, నల్లబెల్లి మండలాలకు చెందిన 292 మందిని కేటాయించగా, 248 మంది పరీక్షకు హాజరైనట్లు, 44 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నెహ్రూసెంటర్: విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా నేడు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నవ్యశ్రీ శనివారం తెలిపాడు. పట్టణంలోని పత్తిపాకలో గల 11కేవీ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మిర్చీ కాలనీ, నందమూరినగర్, సిగ్నల్‌కాలనీ, కొండపల్లి గోపాల్‌నగర్‌కాలనీ, కృష్ణ కాలనీలో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

బాలరాముడి వేషధారణలో చిన్నారి



మహబూబాబాద్ రూరల్: అయోధ్య రామమందిరం ప్రారంభం సందర్భంగా మానుకోట పట్టణంలోని హనుమంతునిగడ్డ ప్రాంతానికి చెందిన పింగిలి రాజేంద్రప్రసాద్, వనిత దంపతుల కుమారుడు పింగిలి రుద్వేద్ మహాదేవాని బాలరాముడి వేషధారణతో అలంకరించారు.

పరామర్శ..

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలంలోని చిన్న నాగారంలో ఇటీవలే మృతిచెందిన బైరు వెంకటమ్మ కుటుంబ సభ్యులు సత్తయ్య, వీరయ్య బద్రయ్యలను శనివారం ఎంపీ మాలోతు కవిత స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు.

జయప్రదం చేయాలి

మరిపెడ రూరల్: రేపటి నుంచి జరిగే చెకుముకి పాఠశాల స్థాయి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి లింగపల్లి దయానంద్ శనివారం తెలిపాడు.

గోదారంగనాథుల కల్యాణోత్సవం

గార్ల: గార్లలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదాదేవిరంగనాథుల కల్యాణ మహోత్సవంను వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా పీఠలపై పరుచూరి కుటుంబరావు కనకలక్ష్మి దంపతులు కూర్చొగా, అర్చకులు అచ్యుతాచార్యులు, హర్షాచార్యులు, రామస్వామి, యాదగిరిస్వామిలు కల్యాణ తంతును నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గార్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ స్వాతిబిందు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు పోలింగ్ కేంద్రాలు బీఎల్ఓలు తెరిచి ఉంచుతారన్నారు. శనివారం మండల వ్యాప్తంగా ఫామ్–6లో 3 దరఖాస్తులు, ఫామ్–7లో 3 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

వసతి గృహాన్ని ప్రారంభించాలి



డోర్నకల్: డోర్నకల్ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని మండలంలోని చిలుకోడు శివారు మోడల్ స్కూల్ ఆవరణలోని వసతి గృహం ఎదురుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బాలికలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికుమార్, ఇన్‌చార్జ్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పాస్టర్స్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

డోర్నకల్: డోర్నకల్ పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పాస్టర్ చిలుముల డేవిడ్‌రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా తిరగమల్ల డేనియల్ శేఖర్, సెక్రెటరీగా నెమలి షాలోమ్, జనరల్ సెక్రెటరీగా మిట్టగనుపుల రమేష్‌పాల్, కోశాధికారిగా కంటిపూడి నరేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బడేటి జాన్సన్, ఆర్ల గిద్యోన్, ఆరెపల్లి జయరాజ్, బొమ్మెర పాల్‌ముత్యం, ముఖ్య సలహాదారుగా గాజుల సామ్యేల్, జీపీ కమల్‌కుమార్, బంక ప్రభురాజు, జెన్నీ జాన్ వెస్లీ ఎన్నికయ్యారు.

మన్నెగూడెంలో గ్రామసభ

చిన్నగూడూరు: మండలంలోని మన్నెగూడెం గ్రామపంచాయతీలో సర్పంచ్ వెంకటరమణ అధ్యక్షతన శనివారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామసభలో చర్చించారు. గ్రామంలో పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రం, జీపీ భవనం, సీసీ రోడ్లు, జీపీ ఫర్నీచర్‌కు రూ.60వేలు, విద్యుత్ దీపాలు వంటి అభివృద్ధి పనుల నిర్మాణానికి గ్రామసభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సునీత, వార్డ్ మెంబర్స్ భాస్కర్, అనిత, అనసూర్య, మల్సూర్ పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



దంతాలపల్లి: మండలకేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, మురళీకృష్ణ, మండల నోడల్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి చేతులపై సంఘం క్యాలెండర్, డైరీ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వేణుమాధవరెడ్డి, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నాగమల్లయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కొండ యాకయ్య, కొమ్మెనబోయిన వంశీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.